అవగాహనతో టీబీకి చెక్



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు, సిబ్బంది

అత్తాపూర్: అవగాహన, అప్రమత్తత, ముందస్తు జాగ్రత్తలతో క్షయ (టీబీ) వ్యాధిని అరికట్టవచ్చని పలువురు వైద్యులు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి టీబీ (క్షయ) ముక్త్ భారత్ అభియాన్–2025లో భాగంగా రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ టీబీ విభాగం ఆధ్వర్యంలో పాండురంగానగర్ బస్తీ దవాఖానాలో జనహిత వెల్ఫేర్ సొసైటీ సహకారంతో ప్రజలకు టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. చెస్ట్ ఎక్స్‌రే, హెచ్ఐవీ టెస్ట్, బ్లడ్ గ్లూకోస్ తదితర పరీక్షలను నిర్వహించారు. దాదాపు 200 మంది బస్తీవాసులు పరీక్షలను చేయించుకున్నారు. డాక్టర్ అరుణ, డాక్టర్ జాఫర్, ఉమామహేశ్వరిరెడ్డి, అపర్ణ, అభిలాష్, నరేష్‌కుమార్, రహీం, మధుభవాని, కిరణ్‌కుమార్, హనుమంతురావు, ఐసీటీసీలు, ఆశా వర్కర్లు, నర్సులు పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగతో భేటీ



శంషాబాద్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగను సోమవారం సాతంరాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ దళిత నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. అవార్డు స్వీకరించిన అనంతరం తొలిసారిగా కలిసిన నేతలు ఆయనకు అభినందనలు తెలిపారు. త్వరలో సాతంరాయిని సందర్శించనున్నట్లు ఈ సందర్భంగా మంద కృష్ణ వారితో అన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, మాజీ ఉప సర్పంచ్ భవానీమల్లేష్, సీనియర్ కాంగ్రెస్ నేత పోతుగంటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


అత్తాపూర్ సమస్యలపై డీసీకి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదన్నారు. ఆయా సమస్యలపై డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవికుమార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. పాండురంగానగర్, రాంబాగ్, శివాజీనగర్, తేజస్వినీనగర్, మారుతినగర్ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో బస్తీ మొత్తం అంధకారంగా తయారైందన్నారు. రాబోయే బోనాల పండగ సందర్భంగా దేవాలయాల వద్ద అధ్వానంగా తయారైన రోడ్లకు మరమ్మతులు చేపట్టి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. దేవాలయాల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు వనం వనం శ్రీరాంరెడ్డి, శివ కుమార్, జైహింద్ రెడ్డి, మారుతీరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న సక్రు నాయక్

రాజేంద్రనగర్: సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జీహెచ్ఎంసీ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రమావత్ సక్రు నాయక్ పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్‌లోని ఏఆర్ దేవరాజ్ భవన్ సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రద్దు చేసిన పాత 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగే జులై 7న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహా రెడ్డి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఎండీ షఫి తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పూడ్చేస్తున్నారు..!

కబ్జాకోరల్లో గంధంగూడలోని కొత్త చెరువు, వెంకన్న కుంట

- మట్టి, రాళ్లతో పూడ్చి కబ్జాచేస్తున్న అక్రమార్కులు
- పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



మట్టిపోసి పూడ్చుతున్న కొత్త చెరువు

బండ్లగూడ: ప్రభుత్వ ఖాళీ స్థలాలతోపాటు చెరువులు, కుంటలు కబ్జారాయుళ్లకు కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు రావడంతో కొందరు కబ్జారాయుళ్లు చెరువులు, కుంటలను ఆక్రమించేసుకుంటున్నారు. ఓ వైపు ఆక్రమించుకుంటూ.. మరో వైపు అమ్మేసుకుంటున్నారు.

- గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గంధంగూడలోని కొత్త చెరువు, వెంకన్న కుంటను కబ్జారాయుళ్ల బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. రియల్టర్ల కన్ను ఈ చెరువులపై పడ్డాయి. మట్టి, రాళుల వేస్తూ వాటిని పూడ్చేస్తున్నారు. ఆపై కబ్జా చేస్తూ అమ్ముకుంటున్నారు. దీని ఆయా చెరువులు, కుంటల విస్తీర్ణం రోజు రోజుకు కుంచించుకుపోతున్నాయి.

మాయమవుతున్న కొత్త చెరువు...

- గంధంగూడ గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 66లో కొత్త చెరువు 4.13 ఎకరాలలో విస్తరించి ఉంది. గత సంవత్సరం మేలో ఈ కొత్త చెరువు కబ్జాకు గురవుతోందనే స్థానికుల సమాచారంతో గండిపేట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు చెరువును పరిశీలించి కబ్జారాయుళ్లు చెరువులో పోసిన మట్టి, రాళ్లను జేసీబీలతో తొలగించారు. చెరువు కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
- చెరువును కబ్జాదారులు కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. స్థానిక ప్రజలు పలు మార్లు హైడ్రాకు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం లేకుండా పోతుంది. ఇదివరకే కొత్త చెరువు కొంత మేర ఆక్రమణకు గురి కాగా ప్రస్తుతం చెరువులో పట్ట పగలే మట్టి కుప్పలు, రాళ్లను వేసి కొత్త చెరువును పూడ్చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

వెంకన్న కుంటా కబ్జా...

కార్పొరేషన్ పరిధిలోని హైదరాబాద్–బీజాపూర్ ప్రధాన జాతీయ రహదారి సమీపంలో ఉన్న వెంకన్న కుంట సర్వే నెంబర్ 27లో 4.25 ఎకరాలలో విస్తరించి ఉంది. రోజు రోజుకు కుంట అన్యాక్రాంతం కావడం, కళ్లముందే ఇంతజరుగుతున్నా.. ఇటు ఇరిగేషన్ అధికారులు కానీ అటు రెవెన్యూ యంత్రాంగం కానీ అటు వైపు కన్నెత్తి చూడటంలేదు. ఆక్కడ గజం భూమి ధర రూ. లక్షల్లో పలకడంతో కొంత మంది రియల్టర్ల కన్ను ఈ చెరువుపై పడింది. దీంతో చెరువు విస్తీర్ణం కాస్తా మంచు కొండలా కరిగిపోతోంది.



కబ్జాకు గురవుతున్న వెంకన్న కుంట

గతంలో పచ్చటి పొలాలు, జల కళ..

గతంలో ఈ వెంకన్నకుంట చెరువు ప్రాంతమంతా పచ్చటి పొలాలతో, సంవత్సరం పొడవునా నీటితో కళకళలాడేది. చుట్టుపక్కల వారు తాగేందుకు ఈ చెరువు నీటిని ఉపయోగించేవారు. ప్రస్తుతం చెరువు వరద కాలువలు, తూములు పూర్తిగా కబ్జాకు గురికావడంతో చెరువులోకి వరదనీరు చేరడంలేదు. చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ భూములు ప్లాట్లుగా మారి భారీ నిర్మాణాలు వెలిశాయి. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రూ. 3 లక్షల నిధులను కేటాయించి చెరువులోంచి మట్టిని తీసి చెరువు కట్ట ఎత్తును పెంచారు.

హైడ్రా చర్యలు తీసుకునేనా..?

తెలంగాణలో ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా అధికారులు తగు చర్యలు చేపట్టి ప్రస్తుతం అక్కడ జరుగుతున్న చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో జరుగుతున్న నిర్మాణాలపై పూర్తిస్థాయి సర్వే చేపట్టి, వెంకన్న కుంటా, కొత్తచెరువులకు హద్దులు నిర్ణయించి చెరువులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులతో సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ శరత్‌చంద్ర అధ్యక్షతన టౌన్ వెండింగ్ కమిటీ (టీవీసీ) సభ్యులతో సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. నెలవారీ టీవీసీ సమావేశం, ఆత్మ నిర్భర్ నిధి పథకంలో గుర్తించబడిన వీధి విక్రయదారులకు రుణాల మంజూరు, రుణాల చెల్లింపుపై చర్చించారు. డిజిటల్ ఆన్ బోర్డింగ్ శిక్షణ శిబిరం నిర్వహణ, వీధి విక్రయదారులను గుర్తించడం, వారికి గుర్తింపు కార్డు జారీ చేయడం, వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు తెరవడం తదితర అంశాలపై సమీక్షించారు. వీధి విక్రయదారుల గ్రూపుల ఏర్పాటు, బ్యాంకు ఖాతాలు తెరవడం, వీధి విక్రయదారుల స్వయం ఉపాధి కార్యక్రమాలు, పీఎం జేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాల ద్వారా వీధి విక్రయదారుల బీమా, వీధి విక్రయదారుల ఆర్థిక, అక్షరాస్యతపై సమీక్షించారు. సమావేశంలో టీఎంసీ ఎస్.శ్రీలత, టీపీఎస్ డి.రాకేష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యరత్న, ఎస్ఐ ప్రభాకర్, ఎస్‌బీఐ మేనేజర్ నిఖిల్, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బండ్లగూడ: ప్రతి ఒక్కరూ తాముంటున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్‌లోని మారుతీనగర్ కాలనీలో తడి, పొడి, హానికారక చెత్త, వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే 15వ డివిజన్‌లోని శాంతినగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. 20వ డివిజన్‌లోని కాళీ మందిర్ జంక్షన్‌లో పబ్లిక్ టాయిలెట్స్ క్లీనింగ్ పనులను పర్యవేక్షించారు. అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులు దరిచేరవనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ అహ్మద్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఓఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పిల్లల హక్కుల రక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీతాదయాకర్‌రెడ్డి



సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు

మణికొండ: తల్లితండ్రులు లేని అనాథ పిల్లలను ఓ కుటుంబ వాతావరణంలో పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులు నేర్పి వారిని ప్రయోజకులను చేయటం హర్షణీయమని, వారి సేవలను సద్వినియోగం చేసుకుని బాలబాలికలు రాణించాలని రాష్ట్ర పిల్లల హక్కుల రక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని ఎస్ఓఎస్ బాలల గ్రామం వ్యవస్థాపకుడు డాక్టర్ హెర్మన్ మైనర్ 106వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఎస్ఓఎస్ డే ఉత్సవాలలో ఆమె సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇతర సంస్థలు ఎస్ఓఎస్‌ను ఆదర్శంగా తీసుకుని అనాథ పిల్లలను పెంచాలన్నారు. సంస్థ అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. జిల్లా పిల్లల సంక్షేమ కమిటీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలోనే అనాథ పిల్లల పరిరక్షణలో ఎస్ఓఎస్ అగ్రస్థానంలో ఉందన్నారు. సమాజంలో ఉన్న ఇలాంటి బాలల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్, ఉన్నత విద్యలో రాణించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అతిథులు అందజేశారు. అనంతరం పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో బాలల గ్రామం డైరెక్టర్ కొట్రేష్‌తో పాటు బాల, బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై కొరడా

గండిపేటలో ట్రేడ్ లైసెన్స్ లేని ఓ షాపు సీజ్



ప్లాస్టిక్‌ను సీజ్ చేసిన దృశ్యం

మణికొండ: నిషేధిత ప్లాస్టిక్‌ను వాడకంతో పాటు ట్రేడ్ లైసెన్సులు లేకుండా షాపులను నిర్వహిస్తున్న వారిపై నార్సింగి మున్సిపాలిటి సిబ్బంది కొరడా ఝుళిపించారు. మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం శానిటేషన్ విభాగం ఇంచార్జి లచ్చిరాం ఆధ్వర్యంలో గండిపేటలోని పలు షాపులలో తనిఖీలు నిర్వహించారు. వాటిల్లో లభించిన నిషేధిత 150 కేజీల ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్‌లు, కవర్‌లను సీజ్ చేశారు. వాటిని వినియోగిస్తున్న వారికి రూ. 20 వేల జరిమానా విధించారు. మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్ లేకుండా షాపును నిర్వహించటంతో పాటు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించిన క్లాసిక్ కూల్ పాయింట్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రతి వ్యాపారి తప్పనిసరి మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకున్న తరువాతే వ్యాపారాలు నిర్వహించాలన్నారు. అలా చేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'మిస్టర్ ఇండియా' విజేతకు ఘన స్వాగతం



కాటేదాన్‌లో ర్యాలీలో పాల్గొన్న మిస్టర్ ఇండియా విజేత రాకేష్

మైలార్‌దేవ్‌పల్లి: మిస్టర్ ఇండియా–2025 విజేతగా నిలిచిన బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన రాకేష్ అర్నేకు సోమవారం కాటేదాన్‌లో ఘన స్వాగతం పలికారు. తెలంగాణ యువతకు గర్వకారణమైన రాకేష్ అర్నే ఇటీవల గోవాలో జరిగిన మిస్టర్ ఇండియా–2025 పోటీల్లో జాతీయ స్థాయిలో విజేతగా నిలిచి దేశాన్ని గర్వపడేలా చేశారని బీఆర్ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. రాకేష్ బాబుల్‌రెడ్డినగర్‌కు రావడంతో కాటేదాన్ నుంచి భారీ విజయ ర్యాలీ నిర్వహించామన్నారు. ర్యాలీలో సుమారు 200 మంది యువత, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. 2020లో మిస్టర్ ఇండియా రన్నరప్‌గా ఉన్నారన్నారు. మిస్టర్ గ్లోబల్ వరల్డ్ 2025 పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించబోతున్న మొదటి తెలుగు యువకుడని తెలిపారు. ఆయన రక్షా గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా పదేళ్లుగా వివిధ సామాజిక సేవా కార్యక్రమల్లో ముందుండి పాల్గొంటున్నారన్నారు. 34 సార్లు రక్తదానం చేసి అనేక మంది ప్రాణాలను కాపాడిన రక్షదాత అని తెలిపారు. రక్షా గ్లోబల్ ఫౌండేషన్ 77 యాక్టివ్, 3 వేల మందికిపైగా వలంటీర్లతో కొనసాగుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి




రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి చైతన్య విలాస్ కాలనీలోని రామాలయంలో సోమవారం బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభాత ఉదయ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.దామోదర్ రెడ్డి, బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్, ఆలయ కమిటీ ప్రతినిధులు, మహేష్, బీజేపీ నాయకులు శ్రీపాల్, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అత్తాపూర్: కాలనీలు, బస్తీల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని అగర్వాల్ సేవా దళ్ సభ్యులు మనీష్‌అగర్వాల్ పేర్కొన్నారు. సోమవారం అత్తాపూర్ డివిజన్‌లోని శ్రీనికేతన్ హై స్కూల్‌లో అగర్వాల్ సేవా దళ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు వైద్య సేవలు అందించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.





శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను సాధిస్తున్నాం

మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి



నార్సింగిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ పొంగులేటి, తదారులు

మణికొండ: ఒకటే దేశం, ఒకటే జెండా, ఒకటే రాజ్యాంగం, ఆర్టికల్–370 రద్దు అనే లక్ష్యంతో జీవితాంతం పోరాడిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ఒకటొకటిగా సాధిస్తున్నామని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన వర్ధంతి సందర్భంగా బీజేపీ నార్సింగి మున్సిపాలిటీ విభాగం అధ్యక్షుడు ఎం.నగేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మైహోం అవతార్ పక్కనున్న సంకటహర హనుమాన్ ఆలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పులమాలలు వేసిన ఘనంగా నివాళులు అర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్, నాయకులు డి.లక్ష్మీనారాయణ, భిక్షపతియాదవ్, ఆదిత్య రెడ్డి, శివరాజ్, ప్రభాకర్, కృష్ణ జైపాల్‌రెడ్డి, బ్రహ్మాచారి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో...

మణికొండ మున్సిపల్ కేంద్రంలోని మల్లన్న ఆలయ ఆవరణలో బీజేపీ అధ్యక్షుడు బి.రవికాంత్ రెడ్డి ఆధ్వర్యంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి బలిదాన్ దివస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలను నాటారు. రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ, నాయకులు అంజన్‌కుమార్ గౌడ్, జె.సిద్దప్ప, శ్రీకాంత్‌స్వామి, అనితాదేవి, ఇందిర, ఎం. రాఘవరెడ్డి, పి.శ్రీనివాస్, బి.శివకుమార్, ఆంనంద్‌రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో...

అత్తాపూర్: లాలా లజపత్ శక్తి కేంద్రం తేజస్వీనగర్ ఇంచార్జి రాచూరి రాజశేఖర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. నేతలు రామమూర్తి, యాదయ్య, రఘునందన్, రంధీర్‌సింగ్, మునీందర్, ప్రభాకర్‌రెడ్డి, సుందర్, రవి, అప్ప, సంతోష్, శర్మ, ప్రకాష్, రిత్విక్, సుబ్బారావు, డాక్టర్ రమేష్, సంజయ్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌గూడలో... హైదర్‌గూడ చౌరస్తాలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ మల్లారెడ్డి, కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్‌లు పాల్గొన్నారు. జిల్లా సెక్రటరీ కొమురయ్య, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కాడెం సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ విజయ్‌కుమార్, నల్లింగ్ రమేష్, జయానంద్‌రెడ్డి, ఆర్.జగన్, పి.వెంకట్‌రెడ్డి, జి.రాజు, సతీష్, లకన్, రాము, భరత్, విజయ్ పాల్గొన్నారు.

సాయిబాబానగర్‌లో...

మైలార్‌దేవ్‌పల్లి: మహోన్నత దేశభక్తుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ నేటి యువతకు స్ఫూర్తిప్రదాత అని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ సాయిబాబానగర్‌లో డివిజన్–2 అధ్యక్షుడు పాండుయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పార్టీ నేతతో కలిసి మొక్కలు నాటారు. నేతలు సంతుగౌడ్, రావుల భాస్కర్, రమణగుప్త, మురళీధర్‌రెడ్డి, బొమ్మరాజు నర్సింహ, మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌నాయక్, రాజుస్వామి, బబ్లు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మదన్‌పల్లి కొత్తతండాలో...

శంషాబాద్ రూరల్: మండలంలోని మదన్‌పల్లి కొత్తతండాలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు రవినాయక్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. నేతలు నర్సింగ్‌నాయక్, ఠాకూర్‌నాయక్, హిరియానాయక్, రాములునాయక్, గోవింద నాయక్ పాల్గొన్నారు.



మణికొండలో అంజన్‌కుమార్‌గౌడ్..



తేజస్వీనగర్‌లో రాచూరి రాజశేఖర్..



సాయిబాబానగర్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి



మదన్‌పల్లి కొత్తతండాలో గిరిజన మోర్చా నేతలు



హైదర్‌గూడ చౌరస్తాలో బీజేపీ నేతలు..